సోఫాలో దిగులుగా కూర్చున్న పులకిత వైపు కించెత్తు ఆశ్చర్యంగా చూస్తూ తిన్నగా వంటింట్లోకి వెళ్లాడు అనంత్.

అందరిలా భార్యే ఎదురువచ్చి మంచినీళ్లు అందించాలని డిమాండ్ చేసే మనస్తత్వం కాదతనిది.




డైనింగ్ టేబుల్ నిండా కోళ్లు కొక్కిరించిన నేలలా, మెతుకులు ప్లేట్లనిండా ఐటమ్స్ ఉండగానే చేయి కడిగినట్లున్నారు.

అవన్నీ చూస్తూ ఫ్రిజ్ తెరిచి నీళ్లబాటిల్ తీసుకొని హాలులోకి వచ్చాడు.

పులకితలో ఏ చలనమూ లేదు.

"ఏయ్ ఏంటా స్టిల్? ఏదో మునిగిపోయినట్లు. నేను నిన్ననే అనుకొన్నాను నువ్వు వాళ్లందర్నీ భోజనానికి పిలిచినప్పుడే"

"ఏంటి ఏంటనుకొన్నారు" కించిత్తు కోపంగా అడిగింది పులకిత.

"వాళ్లు మనింటికి రావడానికంత ఇష్టపడరని వచ్చినా ఏదో తిన్నాననిప్పించి ఏవో అవాకులు చెవాకులు మాట్లాడి వెళ్లే రకాలే తప్ప వేరే కాదని" మెల్లగా చెప్పాడు అనంత్.

"అరె.. చూసినట్లే చెప్పారే! అంత కష్టపడి ఒళ్లంతా హూనం చేసుకొని చేసానే అన్ని ఐటమ్స్ నిజంగానే అద్భుతంగా కుదిరాయ్ కూడా. కాని వీళ్లు ఏదో కోడి కెలికినట్లు తిని లేచారు. పైగా ఎన్ని వంకలు ఎన్ని ఎత్తిపొడుపు మాటలూ అనుకొంటున్నారూ... ఛ.. ఖర్చుకి ఖర్చు పనికి పని ప్చ్..."

"బాధపడకు పులకితా! కడుపు నిండిన వాళ్లకి తిండి సహించదు అదే పేదలకింత పెట్టు వాళ్లు నిన్ను పదికాలాల పాటు గుర్తుంచుకొంటారు. ముఖ్యంగా వాళ్ల 'ఆకలి'ని తీర్చామన్న సంతృప్తి మనకు మిగుల్తుంది" అన్నాడు అనునయంగా.

'నిజమే' అనుకుంటూ వంటింట్లోకి వెళ్లింది పులకిత. మంచినెయ్యి వేసి చేసిన గులాబ్‌జామ్‌లు, బాదుషాలను సగం సగం తిని వదిలేశారు. వాటిని చూస్తూనే ఉసూరుమంది పులకితకి. 'మంచినెయ్యి' తీసుకురమ్మని రెండుసార్లు అనంత్‌ని బజారుకి తిప్పింది గుర్తుకొచ్చింది. నెలాఖరు డబ్బులంతగా ఖర్చుపెట్టకపోతేనేం అనంటున్నా లెక్కచేయకుండా చేసినందుకు

# ఇరుకు

వాలి హిరణ్మయీదేవి

తగిన శాస్తే అయింది.

తామిద్దరు తినగా మిగిలిన పప్పు, చారు, కూరల్లాంటివి పక్కింటి శారదమ్మ వాళ్లకిస్తే ఎంతో అపురూపంగా తినేవాళ్లు. తనదెంతో దానగుణమని వాళ్లు పొగుడుతుంటే ఒక్కోసారి గిల్టీగా అన్పించేది. ఎందుకంటే ఇద్దరికి ఎంత వండాలో తెలీక ఎక్కువ వండేసి, మిగిలిన వాటిని పారేయలేక ఇస్తేనే అలా వాళ్లు పొగడ్తలతో ముంచెత్తేవాళ్లని. అంతేనా తనే పని చేసినా ఎక్కడ కందిపోతానో అన్నట్లు చేతిలో పని లాక్కొని చేసేవాళ్లు ఛ .... అంత మంచి లోగిలిని ఖాళీ చేసి వచ్చి ఇక్కడుండి బాపుకొంటున్నదేంటి"

"పులకితా, పులకితా" అనంత్ పిలుపుకి ఈలోకంలోకి వచ్చింది పులకిత.

ఎక్కడివక్కడ సర్దేసి, డస్ట్‌బిన్‌లో వేసేవి వేసి మొహం కాళ్లూ చేతులు కడుక్కొని వచ్చి కూర్చుంది.

"డల్‌గా కన్పిస్తున్నావ్ కాస్త రిలాక్స్ అవుతావా? లేక మూడ్‌ని మార్చుకొనేందుకు అలా బైటకు తీసుకువెడతా, వస్తావా" లాలనగా అడుగుతున్న అనంత్‌ని చూస్తే ఆమెకి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"తనంటే ఎంత ప్రాణం అంత ప్రాణప్రదంగా అతను చూసుకొంటుంటే తనే చేసింది, ఆక్సిడెంట్‌లో అమ్మానాన్న ఒకేసారి పోతే తనని కంటికి రెప్పలా చూసుకొంటున్న తను మాత్రం అతనిష్టాన్ని మన్నించలేపోయింది.

ఆమె మనసు గతంలోకి తొంగి చూసింది.

000

'టక్...టక్...టక్' తలుపు చప్పుడు వింటూనే పులకిత కనుబొమ్మలు ముడుచుకున్నాయి.

'అబ్బా ఇంతసేవూ ఎదురింటి బాబిగాడు మాథ్స్ చెప్పమంటూ జిడ్డులా పట్టుకొని ఇప్పుడే వదిలాడు ఇలా నడుం వాల్చిందో లేదో మళ్లీ ఎవరు చెప్మా' అనుకొంటూ, మంచం మీద నుండి లేచి తలుపు తెరిచింది పులకిత.

ఎదురుగా పక్కింటి బామ్మగారు, చేతిలో మాగజైన్‌తో.

'అబ్బో ఇక ఈ సీరియల్స్ కథలు అన్నీ చదివించుకొనిగానీ తనని వదలదు. ఈ టీ.వీ.ల యుగంలో అసలన్ని మాగజైన్స్ ఎవరు చదువుతారని తనెంత ఆశ్చర్యపడేదో కానీ ఇదుగో ఇలాంటి పుస్తకప్రియులంతా అక్కడక్కడ చమక్కుమంటూ కన్పిస్తున్నారు' అనుకొంది మనసులో.

"ఏమ్మా పడుకొన్నావా" అడిగిందామె కాస్త నొచ్చుకుంటూ.

'అంత అదృష్టమా' అని మనసులో అనుకొని "అబ్బే ఊరికే అలా పడుకొని టీ.వీ. చూస్తున్నా... నిద్రలోకింకా జారలేదు" అంది పులకిత ఆమె వైపు కుర్చీని జరుపుతూ.

ఆమె కూర్చున్న తర్వాత కథ చదవడం ప్రారంభించింది. అది అయిపోగానే బామ్మగారు తృప్తిగా "మంచం ఉన్నంతవరకే కాలు చాపుకోవాలన్న నీతితో చాలా బాగా రాశాడు... కదూ" అందామె.

"అందరూ అలాగనుకుంటే ఇక అభివృద్ధి మాటేమిటి" అంది పులకిత తనకా కథ నచ్చలేదంటూ.

"అయితే ఆ భర్త తనకీ దేశంలో ఉన్న మంచి జాబ్ నొదులుకొని భార్యా పిల్లల్ని వదిలి అలా విదేశాలకెళ్లడం 'అభివృద్ధే'నంటావ్ అంది.

"అవును ఓ ఐదారేళ్లు మనవి కావనుకుంటే జీవితాంతం సుఖపడొచ్చుగా" అంది పులకిత.

'రెండురెళ్లు ఆరే' అని అంటున్న రెండోక్లాసు అమాయకపు పిల్లను చూసినట్లు పులకితను చూస్తూ నవ్వింది బామ్మ.

"అప్పటికి జీవితమంటూ మిగిలుంటే" అంది చిన్నగా.

"మీరంటున్నదేంటో నాకు నిజంగా అర్థం కావడం లేదు" అంది పులకిత.

"మా చుట్టాలబ్బాయి ఇలాగే అనుకొని దొరికిన చోటల్లా అప్పులు చేసి అమెరికా వెళ్లాడు. రెండేళ్ల తర్వాత భార్యాపిల్లల్ని చూడాలన్పించి వస్తూ విమాన ప్రమాదంలో పోయాడు. మిగిలింది అప్పులు. ఆ అమ్మాయికి వైధవ్యం. ఇప్పుడు జరిగిందానికి బాధపడుతూ, ఆ అప్పులు తీరుస్తూ నానా బాధలూ పడుతోంది" అంది బామ్మ.

దాంతో పులకితకూ బాధనిపించింది. అసలే పెళ్లై ఆర్నెల్లుకూడా కాలేదు. భర్త అనంత్ ఆఫీస్‌కెళ్లి వచ్చేంతవరకూ ఆ ఏడెనిమిది గంటల కాలం గడపటమే దుస్సహంగా ఉందామెకి.

"చక్కగా చదివావమ్మా. రేడియోలో కథలు చదవొచ్చు నువ్వు. మంచి గొంతు మంచి ఉచ్చారణ నీది" అందామె లేస్తూ.

ఆ పొగడ్తకు పులకిత మొహం వికసించింది.

000

"హాయ్ ఏం చేస్తున్నావురా?" అంటూ వంటింట్లోకే సుడిగాలిలా దూసుకొస్తూ అడిగాడు అనంత్.

"మీకోసం పకోడీలు చేయాలనుకొంటే, ఇవి బజ్జీల్లా వస్తున్నాయి" అంది చిరునవ్వుతో పులకిత.

ఆమె మొహంనిండా అలుముకున్న స్వేదాన్ని సుతారంగా అద్దుతూ "నువ్వు నవ్వుతూ ఎదురొస్తే చాలు ఈ టిఫిన్స్ ఎందుకంట నా టిఫిన్ నాకందిస్తే చాలుగా" అన్నడామెను వాటేసుకుంటూ.

"చాల్లెండి ఇప్పుడు 'ఆ' టిఫిన్, భోజనం మాటలొద్దు ఈ టిఫిన్ తిని ఎలా కుదిరాయో చెప్పాల్సిందే" అంటూ వేడివేడి పకోడిల ప్లేట్ అందించింది.

"ఇలారా నా ఒళ్లో కూర్చో కలసి తిందాం" అంటూ కుర్చీలో కూర్చున్నాడు అనంత్, పులకిత వెళ్లి అతని వళ్లో కూర్చుని రెండు పకోడిలను నోట్లో వేసుకుందో లేదో... "అక్కా! మా అమ్మ ఓ గ్లాసుడు నూనె ఇమ్మంది" అంటూ పక్కగదిలో ఉంటోన్న రాణి వచ్చి అడిగింది. మనసులో విసుక్కొని చేసేదేం లేక ఆ పని చేసి వచ్చింది పులకిత.


"బాబోయ్ ఇదేం లోగిలి పేరుకు ప్రేమనగర్ కాలనీ! మనల్ని కాసేపు ప్రేమగా మాట్లాడుకోనివ్వరు ఎవరో ఒకరు దేనికో ఒకదానికి వస్తూనే ఉంటారు ప్చ్ ఎంతకని చేబదుళ్లు ఇస్తుంటాం. ఛ. మనం మంచి ఇల్లుని చూసుకొని వెళ్లిపోదామండి ఈ అలగా జనం మధ్య నాకస్సలు ఊపిరాడటం లేదు అస...."

ఆమె మాటలు పూర్తిగాక ముందే--

"చాలు ఇంకొక్క మాట మాట్లడకు" కాస్త కోపంగా అరిచాడు అనంత్.

"నా మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా ఈ లోగిలివారి గురించి మరొక్క మాట అనొద్దు వీళ్లు డబ్బుకి పేదలేమోగానీ ఆప్యాయతానురాగాలకు గొప్ప మనుషులు అది గుర్తుంచుకో" అన్నాడు సీరియస్‌గా.

ఎప్పుడూ నవ్విస్తూ నవ్వుతూ ఉండే అతను ఒక్కసారిగా అంత రోషం తెచ్చుకోవడం చూసిన పులకితకు



ఏడ్పు ముంచుకొచ్చింది. ఆమె మొహం చూసేసరికి అనంత్‌కి బాధనిపించింది.

"పద అలా గార్డెన్‌కి వెడదాం" అన్నాడామె బుగ్గల్ని నిమురుతూ. దాంతో ఎక్కడ్లేని ఉషారొచ్చి, చకచకా తయారవుతున్న పులకిత వంక చూస్తూ "పిచ్చి పిల్ల పసితనమింకా వదల్లేదు" అనుకున్నాడు అనంత్. రోజులు చకచకా దొర్లుతున్నాయి.

000

"ఏంటీ ఇంటికి తొందరగా రమ్మంటూ ఫోన్ చేశావ్. ఏమైంది" ఆదుర్దాగా అడుగుతూ వచ్చాడు అనంత్.

కిలకిలా నవ్వుతూ మొహాన్ని చేతుల్లో దాచుకుంది పులకిత. సిగ్గుతో ఎర్రనయిన మొహంతో మరింత అందంగా కన్పించిందతని కళ్లకు.

"నేను ఉహూ మీరు మీరు నాన్న కాబోతున్నారు" నునుసిగ్గుతో చెప్పేసింది పులకిత.

ఒక్కక్షణం ఆనందంతో మాట పెగల్లేదు అనంత్‌కి. "తనకంటూ తనవారింకొకరు" ఆ భావం మధురంగా తోచింది అనాథగా అంతకాలం బతికిన అనంత్‌కి. చిన్నప్పుడే తల్లిదండ్రులు పోగా వారాలు చేసుకొంటూ చదివి అదృష్టం బావుండి వెంటనే ఉద్యోగం దొరికి, కాస్త ఆర్థికంగా నిలదొక్కుకొన్నాడు. తననింతవాడిని చేసిన ఆ లోగిలివాళ్లను వదిలివెళ్లలేకనే ఆ ఇరుకు గదుల్లోనే ఉండసాగాడు. అనంత్‌ని గురించి తెలిసిన పక్కింటాయన తమ బంధువులమ్మాయి అయిన పులకితతో వివాహం నిశ్చయించాడు. అనాథని తప్పితే మిగతా అన్ని రకాల మంచి యోగ్యతలున్న అనంత్‌తో పెళ్లి జరిపించారామె తల్లితండ్రులు.

ఐతే తండ్రి ఉద్యోగరీత్యా క్వార్టర్స్‌లలో పెద్ద పెద్ద విశాలమైన గదుల్లో ఉండి వచ్చిన పులకితకు ఆ ఇల్లు నచ్చలేదు. అదేమాట తల్లితో అంటే "ఆ... దాన్దేముంది... అబ్బాయికి మెల్లగా నచ్చజెప్పి ఇల్లు ఖాళీ చేయించు" అంది.

పెళ్లయిన కొత్తలో ఐదారుసార్లు చూచాయగా చెప్పినా అనంత్ లెక్కచేయక పోవటంతో ఒకటి రెండు సార్లు విసుగ్గా కోపంగా చెప్పి చూసింది కానీ అనంత్ కా విషయం ఎత్తితేనే కోపం వస్తోందని గ్రహించి మిన్నకుండిపోయింది. కానీ ఆమెకెలాగైనా ఆ ఇల్లు ఖాళీ చేసి మంచి పోష్ కాలనీలో ఉండాలన్న కోరిక బలంగా ఉంది. అందుకే సమయం కోసం ఎదురుచూడసాగింది.

"ఏంటి? అలా మౌనం వహించారు ఇంత తొందరగా పిల్లలెందుకని అనుకొంటున్నారా?" గోముగా అడిగింది పులకిత.

"ఛ అదేం కాదు ఆనందంతో షాకయ్యాను అందుకే మాట రాలేదు" నవ్వుతూ చెప్పాడు అనంత్.


ఆమె తెల్లటి నునుపయిన పొట్టమీద ముద్దుపెట్టుకుంటూ "నా అందాల పాప ఇక్కడ ఆడుకొంటూ ఉందో బజ్జుందో" అన్నాడు.

"అదేమిటి అందరూ బాబు కావాలనుకొంటారుగా మీరేంటి? పాప కావాలని అనుకొంటున్నారు" అడిగింది ఆశ్చర్యంగా.

"ఎంతమందిని గమనించలేదని? అబ్బాయైతే బోలెడు సమస్యలు తెచ్చిపెడ్తాడు. పెళ్లికాగానే పెళ్లాన్ని తీసుకొని వెళ్లిపోతాడు తల్లితండ్రుల పట్ల అంతగా ప్రేమ ఉండదు. అదే అమ్మాయైతే ఎంచక్కా నట్టింట్లో లక్ష్మీదేవిలా ఉంటుంది. తల్లికి చేదోడువాదోడుగా ఉంటుంది. మనం చూసిన కుర్రాణ్ణి పెళ్లి చేసుకుంటుంది. అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకున్నామే అనుకో చక్కగా మనింట్లోనే పిల్లాపాపలతో ఇంటికి కళ తెస్తుంది..."

"ఓహోహో... శ్రీవారు ఏంటి? ఏకంగా అన్ని కలలు కంటున్నారు? నాకైతే బాబు కావాలని ఉంది."

"సరే నెక్స్ట్ టైమ్ బాబుని కందువుగానీ, ముందైతే నాకో చిట్టితల్లిని ప్రసాదించు" అన్నాడు అనంత్ ఆమెకు నమస్కారం చేస్తూ.




"మరి నేనూ ఓ వరం కోరుకుంటాను మీరూ ప్రసాదించాలి."

"ఓ... అలాగే... ఇవాళ నా మనసెంత ఆనందంగా ఉందో తెలుసా నువ్వేం కావాలంటే అది సరేనా" అన్నాడు అనంత్.

"మరి... మరి మన పాపో బాబో చక్కగా పాకడానికి, తిరుగడానికి మంచి ఆవరణ ఉన్న ఇల్లు విశాలమైన గదుల్లో ఉన్నది కావాలి ఇక్కడి పిల్లలకంతగా శుచీశుభ్రతా చదువూ సంధ్యల్లేవు. ఇలాంటి వాతావరణంలో పిల్లలు పెరుగుతారనుకొంటే ఎలాగో ఉంది మీరూ ఆలోచించండి ప్లీజ్" ఏమీ అనలేకపోయాడు. గర్భిణీ స్త్రీల కోరికలను తీర్చాలన్నది తను వింటూ వచ్చాడు. పులకిత కోరికకు "ఎస్" అనేశాడు. రెంట్ ఎక్కువనిపించినా, ఆమెకు నచ్చిన అపార్ట్‌మెంట్‌లోకి చేరాడు.

అక్కడ చేరాక పెద్దా చిన్న ఇబ్బందులెదురైనా అనంత్ సర్దుకుపోసాగాడు గానీ, పులకితే సర్దుకుపోవడం కష్టమవుతోంది మాటిమాటికి లిఫ్ట్ పాడవటం నీళ్లు రాకుండా ఆగిపోవటం చాలా మామూలయిపోయి ఇబ్బందుల్ని కల్గిస్తోంది. అక్కడివాళ్లందరి ఆర్థికపరిస్థితి కన్నా పులకితావాళ్లదే మెరుగ్గా ఉండటంతో వాళ్లందరూ పులకితావాళ్లకి ఎక్కువ విలువనిచ్చేవాళ్లు. తాము వాళ్లందరి కన్నా ఓ మెట్టు పైస్థాయిలో ఉండటం వల్ల ఆమెకు గర్వంగా ఉండేది. పులకిత వేసుకునే నగలూ చీరలు సదా వాళ్ల ప్రశంసల్ని పొందేవి అందుకు భిన్నంగా ఇక్కడి పరిస్థితి. తామందర్లోకి తక్కువస్థాయి ఉన్న పులకితావాళ్లని వాళ్లు చిన్న చూపు చూడటం మొదలెట్టారు అక్కడికీ వాళ్లతో కలవడానికెన్ని రకాలుగానో పులకిత ప్రయత్నిస్తూనే ఉంది కూడా. ఎక్కడ పలకరిస్తే నెత్తికెక్కుతారో అన్నట్లుగా తప్పుకొనే వాళ్లు. 'మనుషులతో మాట్లాడ్డం'కి మొహం వాచిపోయినట్లవుతోంది. ఒక్కరూ మనసారా గాకున్నా కాస్త పిచ్చాపాటికైనా మాట్లాడేవారు కాదు. అందులోనూ ఆ అపార్ట్‌మెంటుల్లో రకరకాల కులాల జాతుల వాళ్లు ఉండేవాళ్లు అందులో చాలామందికి తెలుగుభాషే రాదు. పులకిత ఎంతగానో మనసుపడ్డ 'ప్రైవసీ' ఇక్కడామెకి 'ఖైదు'లా ఉంది. రోజులు భారంగా గడుస్తున్నాయి. ఇల్లు కదలాలంటే దొంగల భయం.

ఎదుటి, పక్క ఫ్లాట్‌ల వాళ్లు ఏమీ పట్టించుకోరు.

ఒకరోజు లేచిందగ్గర్నుండీ తల తిరుగుతున్నట్లుగా ఉండి, వెంటవెంటనే రెండుసార్లు వాంతులయ్యాయి. ఇన్‌స్పెక్షన్ ఉండటంతో అనంత్‌కి ఆఫీస్‌కి వెళ్లక తప్పలేదు. దానికితోడు ఆరోజు పై పోర్షన్‌లలో నీళ్లు రాక కిందనుండి తెచ్చుకోవలసి వచ్చింది. 'ఓ రెండు బిందెలెలాగో కష్టపడి తెచ్చుకుంటే వంటకీ తాగడానికి పనికొస్తాయి' అనుకొంటూ లేని ఓపిక తెచ్చుకుని కిందకు దిగింది పులకిత. ఆ దారినుండే వెడుతున్న చిన్నా. ఆమెను చూసి నవ్వుతూ దగ్గరికి వచ్చాడు. "ఏంటక్కా! పైకి నీళ్లు రావట్లేదా" అనడిగాడు ఆమె చేతిలోని బిందె వంక చూస్తూ. "ఆంటీ" అన్న పిలుపులకు మొహం మొత్తిన పులకితకు 'అక్కా' అన్న పిలుపు ఎంతో శ్రావ్యంగా వినిపించింది.

"అవును ఈ రెండు బిందెలు పట్టుకెడితే చాలు." అంది చిర్నవ్వుతో. ఎప్పుడూ చిటపటలాడే ఆమె నవ్వగానే చిన్నాకెక్కడ్లేని సంతోషం కల్గింది. "ఇంకా నయం. ఇవి పైవరకూ తీసుకెడతావా? అమ్మ మా చిన్నక్కతో ఇలా ఎప్పుడూ మోయనివ్వలేదు నువ్వు ఇప్పుడు బరువులు మోయకూడదు" అంటూ చనువుగా ఆమె చేతిలోని బిందెలాక్కుని నీళ్లు నింపి, చకచకా మెట్లెక్కి కిచెన్‌లో పెట్టేశాడు.

"అక్కా ఏమన్నా పనులుంటే చెప్పు, కూరగాయలెవన్నా తెచ్చియ్యాలా" అంటూ అడుగుతున్న చిన్నా ఆపేక్ష మొదటిసారి గ్రహించగల్గింది.

"టీ తాగి వెడుతూ గానీ ఉండు చిన్నా" అంది అప్రయత్నంగా. ఓసారి 'మీతో సమంగా చిన్నాకి టీ ఇవ్వమంటారేంటి' అని వాదనకు దిగిన నోటితోనే.

"వద్దక్కా అర్జంటుగా వెళ్లాలి" అంటూ వెళ్లిపోయాడు.

ఏదో వంట చేశాననిపించింది. స్నానం చేయడానిక్కూడా ఓపిక లేక అలాగే పడుకుంది. మళ్లీ కడుపులో తిప్పడంతో బాత్‌రూమ్ వైపు గభాలున వెళ్లబోయింది గానీ అక్కడే వాంతయింది. కళ్లు తిరిగిపోసాగాయ్. "అమ్మా" అంటూ పక్కనే ఉన్న సోఫాకు ఒరిగిపోయింది.

"అమ్మా పులకితా, పులకితా" అంటూ అప్పుడే ఆ గదిలోకి అడుగు పెట్టింది శారదమ్మ. చుట్టూ చూస్తునే. "అయ్యయ్యో, ఇదేంటమ్మా" అంటూ నీళ్లు తెచ్చి పులకిత మొహాన చిలకరించి, మరిన్ని నీళ్లతో కాస్త మొహం కడిగించి, ఆమెను జాగ్రత్తగా మంచం వరకు తీసుకొచ్చి పడుకోబెట్టింది. బకెట్‌తో నీళ్లు పట్టుకొచ్చి అంతా శుభ్రం చేసి, చొరవగా వంటింట్లోకి వెళ్లి అక్కడో నిమ్మకాయ ఉంటే కోసి షర్బత్ తేసి పట్టుకొచ్చి తాగించింది. అప్పటిగ్గానీ తేరుకోలేకపోయింది పులకిత.

"పట్టిమనిషివి కూడా కాదు ఇప్పటివరకూ ఏం తినకుండా ఉన్నావా" అంటూ లోపలికి వెళ్లి అక్కడున్న అన్నం కాస్త పళ్లెంలో వేసుకొచ్చి, తను తెచ్చిన పండుమిరపకాయ పచ్చడి కాస్త నెయ్యి వేసి కలిపి, ఆ ప్లేట్ పులకిత కందించింది. పుల్లపుల్లగా, కారంగా ఉన్న ఆ అన్నం తింటోంటే జిహ్వ లేచొచ్చింది పులకితకు. ఆమె మొహం చూస్తూ "ఆ... నాకు తెల్సు ఇప్పుడివే ఎంతో కమ్మగా తోస్తాయి అందుకే మీ బాబాయి వెక్కిరిస్తున్నా కాస్త దబ్బకాయ పచ్చడి, అల్లంపచ్చడీ తెచ్చాను ఇవి చాలా కాలం నిల్వ ఉండేవే. అప్పుడప్పుడూ వేసుకొని తింటూ ఉండు. చక్కగా పచ్చగా దబ్బపండులా ఉండేదానివి ఎలా అయిపోయావో" అంటూ దగ్గరుండి కొసరికొసరి తినిపించింది. ఆ ఆదరణకి కళ్లలో నీళ్లు తిరిగాయ్ పులకితకు. తల్లి గుర్తొచ్చింది. "ఆ... అన్నట్లు పక్కింటి బామ్మగారు పులిహార ఆవడలూ నీకు ఇమ్మనమన్నారు. ఆ క్యారియర్ లోపల పెట్టాను. కాస్సేపయ్యాక తిను పొద్దుట అనంత్ దార్లో కన్పించాడు. వేవిళ్లతో బాధపడుతున్నావనీ చెప్పాడు. అందుకే పోతేపోనీలే అని ఇవాళ ఫ్యాక్టరీకి వెళ్లలేదు. నిన్ను వెంటనే చూడాలనిపించి వచ్చేశాను--నయమయింది లేకుంటే సాయంత్రం వరకూ ఇలా పడుండేదానివి అంది. పులకిత జుట్టుకు నూనె రాసి చిక్కు తీస్తూ. ఒకరోజు వెళ్లకుంటే ఆరోజు జీతం రాదు ఆమెకి డబ్బు అవసరం ఎంతో ఉన్నా తనకోసం పనిమానుకొని తనకున్న దాంట్లోనే తనకింత తేవడం 'పులకిత'లోని విచక్షణని మేల్కొల్పింది.

అక్కడున్నప్పుడున్నంత ఉత్సాహంగా ఈ మధ్య కాలంలో అనంత్ లేక పోవడమూ స్ఫురించిందామెకి.


అక్కడ 'ఇరుకు' గదులున్నా విశాల స్వభావం గల మనుషులు ఉన్నారు ఇక్కడో గదులే విశాలం మనసులు చాలా ఇరుకు. ఎవరి స్వార్థం వారిదే తప్ప, పక్కనున్నవారి గోడు పట్టించుకోవాలన్న తలంపే లేదెవరిలోనూ.

ఆ రాత్రంతా బాగా ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చింది.

మర్నాడు ఆదివారం. అనంత్ టీ తాగుతూ ఎంజాయ్ చేసే ప్రోగ్రామ్ ఎన్నో ఏళ్లుగా రంగోలి. అది అయిపోగానే పులకిత అతని పక్కకు చేరి--

"ఏమండీ! మనం మళ్లీ మన పాతింట్లోకి మారిపోదామండి. నాకా ప్రేమనగర్ కాలనీయే నచ్చింది" అంది మెల్లిగా. నాగస్వరం విన్నపాములా చటుక్కున ఆమె వైపు తిరిగి అపనమ్మకంగా భార్యవైపు చూశాడు అనంత్.

"నిన్న వాళ్లొచ్చి సాయం చేశారని కాదు. నేనీ ఇంట్లోకి వచ్చిన దగ్గర్నుండీ అక్కడివాళ్ల ఇక్కడివాళ్ల మనస్తత్వాలను బేరీజు లేస్తూనే వున్నాను. మన పిల్లలు ఇరుకుసందులో ఆడినా సరే ప్రేమాస్పదులయిన వారి చేతులలో పెరిగితేనే 'మనుషులుగా' పెరుగుతారు. లేదా ఇక్కడి జనారణ్యంలోని పశువుల్లా మారతారు" అంది పులకిత.




ఆమె మాటల్లోని సిన్సియారిటీ గమనించిన అనంత్ "సరే, మన పోర్షన్‌లోకి వచ్చినవాళ్లు నెల తర్వాత ఖాళీ చేస్తామన్నారుట దాన్ని మనకే అట్టి పెట్టమని రేపే మనింటి ఓనర్‌తో చెబుతాను" అన్నాడు.

ఆ రాత్రి ఇద్దరికీ, చాలా రోజుల తర్వాత హాయిగా నిద్ర పట్టింది. ■